తొలిపూజకు వేళాయె..



కిటకిటలాడుతున్న గాజువాక మార్కెట్

- భారీ సెట్టింగ్‌లతో వినాయక ఉత్సవ పందిళ్లు
- కిటకిటలాడిన మార్కెట్లు
- పట్టణంలో ఎక్కడ చూసినా సందడే సందడి



వినాయకుడిని తరలిస్తున్న భక్తులు



పూజా సామగ్రివద్ద భక్తుల రద్దీ

గాజువాక: వరసిద్ధి వినాయకుడికి తొలిపూజ చేసేందుకు గాజువాక ముస్తాబైంది. ఎక్కడికక్కడ చవితి పందిళ్లు, సందళ్లు కనిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచే మార్కెట్లు పూజా సామగ్రి కొనుగోలుదారులతో కళకళలాడాయి. కొత్తగాజువాక నుంచి సినిమాహాలు కూడలి వరకు ప్రధాన మార్గం కిక్కిరిసిపోయింది. అధికారిక లెక్కల ప్రకారం 91 చోట్ల మండపాలు వేస్తున్నారు. అనధికారికంగా మరో 150 వరకు మండపాలు వెలుస్తున్నాయి. ఎక్కడ చూసినా యువకులు ఉత్సవ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. పాతగాజువాక, కొత్తగాజువాక, కణితి రోడ్ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లలో వినాయకుడి విగ్రహాలు, పూజా సామగ్రి విక్రయించారు. కొంత మంది ప్రతిమలను ఆర్డర్లపై తయారు చేయించుకోగా, మరి కొంతమంది రెడీమేడ్ ప్రతిమలను కొనుగోలు చేసి తమ మండపాలకు తరలించారు. కొనుగోలుదారులతో గాజువాక మెయిన్‌రోడ్డు, కణితి రోడ్డు రద్దీగా మారాయి.

కళ్లు మిరిమిట్లు గొలిపే సెట్టింగ్‌లు

వినాయక ఉత్సవాలు నిర్వహణకు పట్టణంలో కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా మండపాలు తీర్చిదిద్దారు. రంగు రంగుల వస్త్రాలను ఉపయోగించి సినిమా సెట్టింగ్‌లను తలపించే విధంగా మండపాలు రూపొందించారు. వినూత్న రీతిలో మండపాలేను ఏర్పాటు చేసి గణనాథుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వీటికోసం నిర్వాహకులు నిపుణులైన కళాకారులను పక్క రాష్ట్రాల నుంచి కూడా తీసుకొచ్చారు. శ్రీనగర్‌లో ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి విగ్రహం వద్ద ఆలయాన్ని తలపించే విధంగా సెట్టింగ్ రూపొందించారు. ఇంకా అనేక ప్రాంతాల్లో వివిధ సెట్టింగ్‌లతో పందిళ్లు ఏర్పాటు చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకొంటున్నారు.

ధరలు చూస్తే దడ ..లంబోదరుడి పూజా సామాగ్రి ధరలు చుక్కలనంటాయి. మార్కెట్‌లో కొబ్బరికాయలు, పెద అరటిపళ్లు, పత్రిదళం, మామిడి ఆకులు, అరటి ఆకు, పూలు, ఒక యాపిల్, రెండు చెరుకు ముక్కలు, జామకాయలు, వినాయకుడి పూజా పాళి (పల్లకి)ని ఒక సెటుగా రూ.200లకు అమ్ముతున్నారు. వినాయకుని ప్రతిమ ధర దీనికి అదనం. ప్రతిమలకు సైజుల ఆధారంగా ధరలు నిర్ణయించారు. ఆరు అడుగుల విగ్రహం రూ.15వేలకు దగ్గకుండా విక్రయిస్తున్నారు. ధరలు ఎక్కువైనప్పటికీ తప్పుదులే అంటూ నిర్వాహకులు సరిపెట్టుకొంటున్నారు.

ఆంక్షలు మరవద్దు

ఉత్సవ నిర్వహణలో పడి నిబంధనలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే నిర్వాహకులపై ఈసారి పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారు. ఈ మేరకు వివిధ విభాగాల అధికారులు కూడా ఈ విషయంలో సమన్వయంతో వ్యహరిస్తున్నారు. ప్రతి పందిరికీ పోలీసు అనుమతి తప్పనిసరన్న విషయం గుర్తుంచుకోవాలి. ప్రతి మండపం వద్ద ఎక్కువ సౌండ్‌తో స్పీకర్లు పెట్టినా, రోడ్డును మూసివేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించినా నిర్వహకులపై చర్యలు తీసుకుంటారు. నిమజ్జనం సమయంలో పోలీసులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి. నిబంధనలను నిర్లక్ష్యం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

కిక్కిరిసిన అక్కిరెడ్డిపాలెం రోడ్డు



అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డులో రద్దీ

అక్కిరెడ్డిపాలెం: వినాయచవితి పూజా సామగ్రి కొనుగోలు దారులతో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డు శుక్రవారం సాయంత్రం కిక్కిరిసి పోయింది. ఒక వైపు వాహనదారుల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. పూజా సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటడంతో భక్తుల జేబులకు చిల్లులు పడ్డాయి. అరటిపళ్లు డజను రూ.100, కొబ్బరికాయ ఒకటి రూ.40 నుంచి 60, పాలవెల్లికి కట్టే పండ్లు (పిందెలు) రూ.10 నుంచి రూ.30, పువ్వులు కనీసం ఐదు పువ్వులు రూ.20 చొప్పున విక్రయించారు.

మండపాల వద్ద డీజేలు నిషేధం



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద డీజేలు నిషేధించినట్టు స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు తెలిపారు. మండపాలు ఏర్పాటు చేసేవారు టౌన్ అడ్మిన్, స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్, ఎలక్ట్రికల్ విభాగాల వద్ద అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇతరులకు అసౌకర్యం కలిగించేలా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు వినియోగించరాదన్నారు. మండపాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావు లేదన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కార్మిక పక్షపాతి రుద్రరాజు

ఉక్కునగరం: సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ చిత్రపటానికి శుక్రవారం స్టీల్‌ప్లాంట్‌లోని సీపీఎం కార్యాలయంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేద ప్రజానీకం కోసం తుది శ్వాస విడిచే వరకు పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్. నారాయణరావు, శ్రీనివాసరాజు, యు. రామస్వామి, వై.టి. దాస్, టి.వి.కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగా సాధనతో జ్ఞాపకశక్తి మెరుగుదల



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాజయోగి బీకే మంజునాథ్

అగనంపూడి: విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకోడానికి యోగా సాధన చేయాలని బ్రహ్మకుమారీస్ బెంగళూరు ఇన్‌చార్జి, రాజ యోగి బీకే మంజునాథ్ అన్నారు. అగనంపూడి దిబ్బపాలెం పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోడానికి ఉన్నతమైన లక్ష్యాలను అలవర్చుకోడానికి మెడిటేషన్, యోగా దోహదపడతాయన్నారు. ప్రతీరోజు యోగ సాధన, మెడిటేషన్ చేయడం వల్ల మానసిక స్థిరత్వం కలుగుతుందన్నారు. తర్వాత విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగారావు, ఎస్.నాగభూషణం, అగనంపూడి దివ్య జ్యోతి భవనం ఇన్‌చార్జి బీకే రామకోటి, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్బీబీఎల్ సేవలు



ట్యాంకర్ ద్వారా మంచినీటిని అందజేస్తున్న ఎస్బీబీఎల్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: విజయవాడలోని పాయకాపురం, ప్రకాష్‌నగర్ ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కనీసం తాగడానికి ఇతర అవసరాలకు మంచినీరు అందలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో శీలానగర్‌లోని ఎస్బీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ ఆర్థిక సహాయంతో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. తాగునీటి బాటిళ్లు కూడా అందజేస్తున్నామని తెలిపారు.


ప్రసాదరావుకు ధ్యాన నివాళి



మాట్లాడుతున్న భీమనేని వంశీ కిరణ్

పెదగంట్యాడ: ధ్యాన రత్న నంద ప్రసాదరావు తృతీయ స్మృతి స్మరణోత్సవాన్ని స్థానిక సమతానగర్‌లోని విశ్వ విజ్ఞాన శక్తి పీఠం ధ్యాన కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో భీమనేని వంశీ కిరణ్ మాట్లాడుతూ ధ్యాన ప్రచారమే శ్వాసగా పని చేశారని, పత్రీజీ కలలు సాకారం చేయడానికి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో నంద జయలక్ష్మి, మీసాల శివ గణేశ్వరరావు, సుబ్బలక్ష్మి, కట్టా పద్మ, జీఎస్ఎన్ మూర్తి, సత్యవతి పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ మల్లేశ్వరరావును అభినందిస్తున్న 85వ వార్డు నాయకులు

అగనంపూడి: దువ్వాడ శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్‌గా కె.మల్లేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఈవ్‌టీజింగ్, ఇతర మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

అభినందన

బాధ్యతలు స్వీకరించిన సీఐ మల్లేశ్వరరావును 85వ వార్డు అగనంపూడి, ఫార్మాసిటీకి చెందిన నాయకులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ఫార్మాసిటీ నిర్వాసిత సంఘం నాయకులు ఇల్లపు ప్రసాద్, అగనంపూడి నిర్వాసితకాలనీల నాయకులు బి.సత్యనారాయణ, కె.తాతారావు, పైడిరత్నం, చందు పాల్గొన్నారు.

మట్టిగణపతులనే పూజిద్దాం



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న అప్పలరెడ్డి



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు

పెదగంట్యాడ: పర్యావరణ హితంగా పండగలు జరుపుకోవాలని జీఏఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అప్పలరెడ్డి కోరారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నీలాపువీధిలో మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొందేశి శ్రీదేవి, గొందేశి దేవీ ప్రసాద్‌రెడ్డి, గొందేశి ప్రకాశ్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డిపాల్గొన్నారు.

- స్పందించే హృదయం ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 250 మట్టి వినాయక ప్రతిమలను ఉపాధ్యాయులు, విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, నీలి బాబ్జీ, నారాయణరావు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి రసాయనాలతో కూడిన వినాయక విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు అని, మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం శీలానగర్ పెట్రోల్ బంక్‌లో సీఐ, పలాస ఎమ్మెల్యే శిరీష కుమారుడు శ్రీహర్ష చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో బంక్ ప్రతినిధి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి: మట్టి ప్రతిమలను పూజించడం వల్ల మానవాళి మనుగడకు ఎటువంటి హాని ఉండబోదని హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. కూర్మన్నపాలెం శిష్ట కరణ అసోసియేషన్ ఆధ్వర్యంలో వడ్లపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో మట్టి వినాయ ప్రతిమలు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.సత్యారావు, గంగవరం గోపి, శ్రీనివాస్ పట్నాయక్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించాలని ఏపీ ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ అన్నాజీరావు పాల్గొన్నారు.

10న ఉక్కుకు మద్దతుగా రాస్తారోకోలు



దీక్షా శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌టీయూసీ, ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును బతికించాలనే నినాదం హోరెత్తేలా ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించనున్నామని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గొందేశి వెంకటరమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి, బొడ్డ గోవింద్ తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కులో ఉత్పత్తిని మెరుగుపర్చడానికి యాజమాన్యం ఎటువంటి చర్యలు చేపట్టకపోయినా, కార్మికులు, ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి మాత్రం పక్కా ప్రణాళికలు వేసి వాటిని అమలు చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో 12వేల మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అందులో మూడో వంతు ఉద్యోగులను ఇంటికి పంపించడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటుందని మండిపడ్డారు. ముడి సరకులు కొనుగోలుకు నిధులు కేటాయించాలని, నిర్వహణ మూలధనం సర్దుబాటు చేయాలని ఉద్యోగులు కోరితే కేంద్ర ప్రభుత్వ పెద్దలు మాత్రం వీఆర్ఎస్ పథకంలో ఉద్యోగులను ఇంటికి పంపించడానికి నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మార్టుపూడి పరదేశి, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర, శ్రీనివాస్ నాయుడు, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, అండిబోయిన అప్పారావు, దరిగి రవి, గాలి నూకరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో నీలవేణి



పౌష్టికాహారం పై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత



తల్లీ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న లీఫార్మా డైరెక్టర్ లీలారాణి

గాజువాక: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై 87వ వార్డు ఈర్లవానిపాలెం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.స్రవంతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పోషకాహార పథకాన్ని బాలింతలు వినియోగించుకోవాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

పెదగంట్యాడ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 75వ వార్డు రెడ్డి ముసలనాయుడుపాలెం, దుర్గవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీలవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవడంతో పాలు సలహాలు సూచనలు పాటిస్తే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యకర్త బుజ్జి పాల్గొన్నారు.

- 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుజాత గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

తల్లిపాలు బిడ్డకు అమృత తుల్యం

అగనంపూడి: పిల్లలు, వారి తల్లుల ఆరోగ్యం కోసం లీఫార్మా కంపెనీ, లీ హెల్త్ డొమెయిన్ ఇండియా సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయని లీఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి అన్నారు. 86వ వార్డు ఫకీర్‌తక్యాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా వివిధ పోషక విలువలతో కూడిన ఆహారం అందించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు.

పౌష్టికాహార లోపంతో అనర్థాలు

పౌష్టికాహారం లోపంతో పుట్టిన బిడ్డలు అనారోగ్యంతో సతమతమవుతూ జీవితాంతం అవస్థలకు గురవుతున్నారని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా ఫార్మా కళాశాల విద్యార్థులు పరిసర గ్రామాల్లో ప్లకార్డులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



కణితి హైస్కూల్‌లో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మానవత్వ సేవా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్య ప్రకాశరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి, సహకారం ఎనలేదన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు



ఉక్కు శ్రీష్టి వరల్డ్ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-11లోని శ్రీష్టి వరల్డ్ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మట్టిని, సహజ రంగులను ఉపయోగించి గణేష్ ప్రతిమలను తయారు చేశారు. అందరినీ విజయం వరించాలని కోరుతూ పూజలు చేశారు. పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ పర్యావరణం పట్ల బాధ్యతను గుర్తు చేయడానికే ఇటువంటి కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.